క్లుప్తంగా

ఘనంగా శ్రీమహా భాగవత ప్రవచనాలు


ప్రవచనాలు చెబుతున్న జగన్మోహన్

కొత్తగూడెంటౌన్: ధనుర్మాస మహోత్సవముల సందర్భంగా రామవరంలోని శ్రీ సాకేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి ప్రవచన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రవచనకర్త లట్టి జగన్మోహన్‌రావు, ఆలయ అర్చకులు ప్రతాపురం శ్రీదరాచ్యార్యులు భక్తులకు ప్రవచనాలను వివరించారు. ప్రతీరోజు సాయంకాలం 6 గంటల నుంచి ప్రవచనములు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు శ్రీనివాస్, ఆదిమూల రాములు, కొయ్యాడ శ్రీనివాస్, గడ్డం రాంచందర్, శనిగరపు శంకర్, ఆవునూరి సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరం కనకయ్యకు శుభాకాంక్షలు


కనకయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు యాట ఓదేలు ఆధ్వర్యంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గోడ రమేష్, మేకల శంకర్రావు, చేనెల్లి మురళి, నాగయ్య, దుర్గాప్రసాద్, బెల్లెదుల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


పూజలో పాల్గొన్న భక్తులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మండలంలోని శ్రీరామాంజనేయ కాలనీలో కొలువుదీరిన శ్రీరామాంజనేయ స్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జీవధ్వజ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ముగిసింది. అర్చకులు బ్రహ్మర్షి కటకం భాస్కరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నారాయణ సేవా (అన్నదానం) నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్దబోయిన సత్యనారాయణ, మేడి అజయ్‌కుమార్, పిండి లక్ష్మీనారాయణ దంపతులు, గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అధ్యాపకులను సత్కరిస్తున్న విద్యార్థులు

ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980–82 ఎంపీసీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. బైరి కుమారస్వామి కళాశాలకు కంప్యూటర్, రాజేంద్రప్రసాద్ బీరువాను అందజేశారు. కార్యక్రమంలో నాగేందర్, రవి, భిక్షపతి, రామచందర్, అరుణాదేవి, శివకుమారి, సాలార్ బేగ్, అల్లావుద్దీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ టెంపుల్ షాపులకు వేలంపాట..

కొత్తగూడెంటౌన్: శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)కు చెందిన షాపులను మంగళవారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.సులోచన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షాపు నంబర్ -2, షాపు నంబర్-6 లతో పాటు ఆలయం ఆవరణలో ఎదురుగా కొబ్బరికాయలు, పూజా సామాగ్రి, కొబ్బరి చిప్పలు, వస్త్రాలు పొగు వంటివి రెండు సంవత్సరాల కాలానికి వేలంపాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు డిపాజిట్ చెల్లించి, పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాలకు 9908008860, 9550429475, నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భగ్గుమంటున్న కూరగాయలు

- బెంబేలెత్తుతున్న మధ్య తరగతి ప్రజలు
- తుపానే కారణమంటున్న వ్యాపారులు


సుజాతనగర్‌లో కూరగాయల దుకాణం

సుజాతనగర్: పెరిగిన కూరగాయల ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. వేసవికి ముందే కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సాధారణంగా శీతాకాలం వచ్చిందంటే కూరగాయల ధరలు పడిపోయి గిట్టుబాటు ధర రాక రైతులు విలవిలలాడుతుంటారు. కానీ ఈ ఏడాది శీతాకాలం ఆరంభంలోనే కూరగాయ ధరలు మండుతున్నాయి. టమాట, ఆలుగడ్డ మినహా మిగిలిన కూరగాయల ధరలన్నీ ఎక్కువగా ఉండటంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఏ కూరగాయలైనా కేజీ రూ.50 పైనే. మిర్చి ధర మంట పుట్టిస్తోంది. బీరకాయ ధర రెట్టింపైంది. చిక్కుడు సామాన్యులకు చిక్కడం లేదు. వంకాయ, గోరుచిక్కుడు, కాకరకాయ.. ఇలా ఏ కూరగాయల ధర చూసినా అధికంగా ఉన్నాయి. ఓ వైపు బియ్యం, పప్పులు, వంటనూనె, ధరలు పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయలు ధరలు కూడా భగ్గుమంటూ సామాన్యులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. రూ.100 తీసుకొని కూరగాయల మార్కెట్‌కు వెళితే రెండు రోజులకు సరిపడా కూరగాయలు రాని పరిస్థితి నెలకొంది. ఏ రకం కూరగాయలు కొనాలన్నా కిలో రూ.50 పైనే పలుకుతున్నాయి. ఫలితంగా సామాన్య, పేద కుటుంబాల వారు పచ్చడి మెతుకులతోనే కడుపు నింపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఉల్లిపాయల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. నిన్న మొన్నటి వరకు కిలో ఉల్లిపాయలు రూ.30 ఉండగా రెండు రోజుల నుంచి రూ.55 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. దీంతో కూరగాయలు, ఉల్లిపాయలు కొనలేక వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

తుపాన్ ప్రభావం..

వాస్తవానికి ఈ ఏడాది జిల్లాలో సగటు వర్షపాతం నమోదైనప్పటికీ కూరగాయ పంటల సాగు మాత్రం తగ్గింది. మొన్నటి వరకు కార్తీకమాసం ఉండటంతో కాయగూరలకు బాగా డిమాండ్ ఉంది. కార్తీకమాసం ముగిసినా కూరగాయల ధరలు తగ్గకపోగా కేజీ రూ.10 నుంచి రూ.20 వరకు పెరిగాయి. ఇటీవల వచ్చిన మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఆంధ్రా ప్రాంతంలో కాయగూరల తోటలకు నష్టం వాటిల్లడంతో దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో కూరగాయల ధరలు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

జాడలేని కూరగాయల సాగు..

మండల వ్యాప్తంగా రెండు, మూడు గ్రామాల పరిధిలో కొందరు రైతులు మాత్రమే కూరగాయల సాగు చేస్తున్నారు. ఎక్కువ మంది పత్తి, వరి పంటలే సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు చేసే రైతులే కరువయ్యారు. దీంతో ఇక్కడి కూరగాయల వ్యాపారులు కొత్తగూడెం, ఖమ్మం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కూరగాయల మారుబేరం చేస్తున్నారు. స్థానికంగా కూరగాయలు సాగు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని, ఉద్యానవన శాఖాధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కేజీ కూరగాయల ధరలు రూపాయల్లో	
బెండ	70
చిక్కుడుకాయ	100
వంకాయ	60
మిర్చి	50
క్యాబేజీ	40
దోసకాయ	40
ఆలుగడ్డ	30
బీయకాయ	70
దొండకాయ	70
టమాట	30

ఖర్చు ఎక్కువ అవుతోంది..



నిత్యావసర సరుకుల ధరలతో పాటు నెల రోజులుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. నెల రోజుల నుంచి అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరిగిన కూరగాయల ధరలతో ఆర్థిక భారం పడుతోంది.

– మైపా రాజు, సింగభూపాలెం

ఏం తినేటట్టు లేదు..



కూరగాయలు కొనాలంటే సామాన్యులకు పెరిగిన ధరలు భారమై పోతున్నాయి. కూరగాయలు కొందామని బజారుకు వస్తే వ్యాపారులు చెప్పే ధరలతో కళ్లు తిరుగుతున్నాయి. పెరిగిన ధరలతో కూరగాయలు కొనలేకపోతున్నాం.

– కున్సోత్ ప్రసాద్, లక్ష్మీదేవిపల్లి

వృద్ధాప్యంలో ఆరోగ్యం ముఖ్యం


మాట్లాడుతున్న కుమారస్వామి

కొత్తగూడెంఅర్బన్: వృద్ధాప్యంలో ఆరోగ్యం అతి ముఖ్యం అని సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.కుమారస్వామి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డేను కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులకు తన పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఎస్‌బీఐ సర్వీస్ మేనేజర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులకు అవసరమైన రుణాలు గానీ, డోర్ స్టెప్ సర్వీసెస్ గానీ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వెస్లీ మాట్లాడుతూ... జిల్లాలో మండల కమిటీల నిర్మాణం పటిష్టత, ఆర్థిక పరిపుష్టి, సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఇండియన్ బ్యాంకు మేనేజర్ సుధాకర్, సంఘం జిల్లా అధ్యక్షులు వెస్లీ, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఆనందకుమార్, కోశాధికారి డీఆర్.ప్రసాదరావు, కార్యదర్శి ఎం.మోహన్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి తిరుపాల్, ఉపాధ్యక్షులు నారాయణరావు, జె.పార్వతీకుమారి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్ అజరయ్య పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులను అవమానిస్తున్నారు..


మాట్లాడుతున్న కనకరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి 134 చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎండీ పేషీలో సంస్థలో సుమారు 40 వేల మంది కార్మికులు, ఉద్యోగులు ఉండగా వారందరినీ కాదని, సునీల్ అనే వ్యక్తిని మీ పర్సనల్ పీఏ (అవుట్‌సోర్సింగ్)గా నియమించటం సింగరేణి ఉద్యోగులను అవమానించడమేనని కాంగ్రెస్ నాయకులు ఆకునూరి కనకరాజు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సింగరేణిలో సుమారు 30 వేల మంది అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఇవ్వకుండా కేవలం సునీల్‌కు లాభాల వాటా ఎలా ఇస్తారని, సదరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందజేసినట్లుగానే సింగరేణిలోని అందరి ఉద్యోగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సునీల్ వలన కంపెనీకి ఎంత లాభం వస్తుందో తెలియదు కానీ, సింగరేణి కార్మికుల వలనే కంపెనీకి రూ.కోట్ల లాభం వస్తుందన్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని, వారిని డిపెండెంట్ ఉద్యోగాలతో తొలగిస్తున్న క్రమంలో వీరిని కంపెనీలో ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు. వెంటనే మీరు ప్రత్యేకంగా నియమించిన వారిని ఇంటికి పంపించటమే కాకుండా కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన వేతనం ఇచ్చి మిగతా వాటిని రికవరీ చేయాలని కోరారు.

ఘంటసాల పాటలు అజరామరం

పాల్వంచ: ఘంటసాల పాటలు అజరామరం అని పలువురు కొనియాడారు. ఘంటసాల జయంతి పురస్కరించుకుని ఆదివారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లో అభ్యుదయ కళాసమితి, ఖాసీం మెగా ఈవెంట్, శ్రీవెంకటేశ్వర కళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఘంటసాల పాటలు పాడి అలరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఔన్నత్యాన్ని చాటిన గొప్ప వ్యక్తి ఘంటసాల అన్నారు. కొత్వాల శ్రీనివాసరావు, నిర్వాహకులు ఎస్‌కె.మీరా, ఎస్‌కె.బాషా, ఎస్‌కె.ఖాసీం, పాకాలపాటి రోశయ్య చౌదరి, శ్రీపాద సత్యనారాయణ, నూకల రంగారావు, మంతపురి రాజుగౌడ్, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, చలవాది ప్రకాశ్ పాల్గొన్నారు.

ఘనంగా పద్మశాలీ సంఘం వనమహోత్సవం


మహిళలకు బహుమతులు అందిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు


అధ్యక్షుడు రమాకాంత్


ప్రధాన కార్యదర్శి కిశోర్

పాల్వంచ: పట్టణంలోని ఆడమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో ఆదివారం పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీలు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో గడిపారు. విజేతలకు బహుమతులు అందించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా ప్రతీఒక్కరు సమాజసేవ చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆడెపు రమాకాంత్, ప్రధాన కార్యదర్శిగా దోమల కిశోర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దుగ్గిళ్ల రామ్మూర్తి, ఆడెపు రమాకాంత్, దోమల కిశోర్, యర్రగుంట సాంబశివరావు, గుండు రవికుమార్, నర్సింహారావు, పద్మజ, చెన్నూరి నర్సింహారావు, ప్రభాకర్, శ్యాం, రాము, శ్రీకాంత్, శంకర్, ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.


నేడు ఆలయ వార్షికోత్సవం

జూలూరుపాడు: మండల కేంద్రంలోని శ్రీకోట మైసమ్మతల్లి ఆలయం 12వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహా అన్నదానం ఉంటుందని, సాయంత్రం గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య అన్నారు. ఆదివారం రామవరంలోని ఉమెన్స్ హాస్టల్‌లో గాంధీ పథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకుంటూ, ఆహార నియమాలను పాటించాలని సూచించారు. బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చింతలచెర్వు గెర్షోము, వినోదిని, ఏర్నియా, పుష్పలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత ఉపాధ్యాయుడి వైద్యానికి వితరణ


ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: బాధిత ఉపాధ్యాయ సంఘం నేత వైద్యానికి తోటి సంఘం సభ్యులు వితరణ చేశారు. ఈ మేరకు ఆదివారం పీఆర్‌టీయూ టేకులపల్లి మండల అధ్యక్షుడు గుగులోత్ మోతీలాల్ మాట్లాడుతూ... పీఆర్‌టీయూ టేకులపల్లి మండల ప్రధాన కార్యదర్శి టి.సర్కార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టేకులపల్లి మండలంతో పాటు ఉమ్మడి ఖమ్మం, ములుగు, మహబూబాబాద్, నారాయణఖేడ్‌లకు చెందిన సభ్యులు తమ వంతుగా రూ.1,10,000 చెక్కుని సర్కార్ వైద్యానికి అందజేశారు. ఆపదలో ఉన్న ఉపాధ్యాయుడికి ఆపన్నహస్తం అందించడమే పీఆర్‌టీయూ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో బి.రవి, టి.రవీందర్, జి.మోతీలాల్, బి.శ్రీనివాస్‌రావు, కె.ప్రసాద్, బి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు

సుజాతనగర్: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పుట్టినరోజు వేడుకలను సింగభూపాలెం గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గడిపల్లి కవిత, ఖలీల్‌పాషా, నాగరాజు, నల్లగొర్ల గోపాలరావు, రాసబంటి బాబు, మల్లయ్య, రామయ్య, మల్సూరు, గురవయ్య పాల్గొన్నారు.

ప్రజలు ఉన్నత మార్గంలో నడవాలి..


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్ సురేశ్

పాల్వంచ: యేసుక్రీస్తు లోకరక్షకుడిగా జన్మించారని, ఆయన చూపిన ప్రేమ, కరుణ, దయ ఇతరులకు చాటాలని యేసు కరుణా సువార్త మందిరం పాస్టర్ సురేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉల్వనూరు గ్రామంలో క్రిస్మస్ మాసం పురస్కరించుకుని పేదలకు, వృద్ధులకు రగ్గులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. సమాజ సేవ గొప్పదని తమకు తోచిన దానిలో ఇతరులకు సాయం చేయాలన్నారు. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవాలని చెప్పారు. చెడు వ్యసనాలను వీడి, ఉన్నత మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు ప్రభుదాస్, సందీప్, రవి, సురేశ్, రంజిత్, జగన్, కాటయ్యబాబు, కృపాకర్, నాని, లక్ష్మణ్, జగదీశ్, బబ్లూ, రాజు, కిరణ్, మధు, వర్షిత్, ప్రభు భూషణ్, విజయ్‌బాబు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్‌తోనే కార్మికుల సంక్షేమం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఎంఎస్ నాయకులు

ఇల్లెందు: సింగరేణిలో జాతీయ కార్మిక సంఘం బీఎంఎస్ జాతీయ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఆదివారం ఇల్లెందులోని జీఎం కార్యాలయం వద్ద జరిగిన పిట్ మీటింగ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. మెరుగైన 11వ వేతన ఒప్పందంలో 19శాతం ఎంజీబీ, అలవెన్సులలో 25శాతం పెరుగుదల సాధించటంలో తమ సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. సింగరేణి కంపెనీని అభివృద్ధి పర్చటానికి బొగ్గు గనుల వేలంలో పాల్గొని మిగతా రాష్ట్రాలలో బొగ్గు గనులను సాధించటానికి కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణిలో కార్మికులకు సొంత ఇంటి పథకం సాధించటంలో తమ సంఘం విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. ఇల్లు కట్టుకోవడానికి వడ్డీ లేని రుణం సాధించిందన్నారు. కంపెనీ వ్యవహారాల్లో అనవసర రాజకీయ జోక్యాన్ని పూర్తిగా అరికట్టడానికి సంఘం కృషి చేసిందన్నారు. సమావేశంలో మాధవ్‌నాయక్, పవన్‌కుమార్, భీమా, సుందర్, ఆరుట్ల మాధవరెడ్డి, నాయిని సైదులు, లీలా కృష్ణ, శశికుమార్, రాజశేఖర్, రాము, వెంకటేష్, గోపాలకృష్ణ, శివ, శ్రీను, భద్రం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుంది


మాట్లాడుతున్న రాజారావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు అండగా ఉంటే, సంస్థ పరిరక్షణకు ఆహర్నిశలు కృషి చేస్తున్న సీఐటీయూ గుర్తు ఉదయించే సూర్యునిపై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని సంఘం నాయకుడు జి.రాజారావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఏరియా పరిధిలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలపై యాజమాన్యాన్ని నిలదీయాల్సిన కార్మిక సంఘాలు వారికి తొత్తుగా మారి కార్మికుల హక్కులను తాకట్టుపెట్టిన సంఘాలకు కార్మికులు బుద్ధి చెప్పాలన్నారు. సింగరేణిని ప్రైవేట్‌కు అప్పగించేందుకు మద్దతు పలుకుతున్న యూనియన్లను ఓడించేందుకు ప్రతీ కార్మికుడు సిద్ధంగా ఉండాలన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం, సొంత ఇంటి కల కోసం సింగరేణిలో జరుగుతున్న అవినీతి కార్యకలాపాలను అరి కట్టేందుకు కృషి చేస్తున్న సీఐటీయూకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. విజయగిరి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు, కే.రమేష్‌బాబు, నాజర్, రామ్మూర్తి, డి.వీరన్న, భూక్యా రమేష్, లిక్కి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని సమాధి చేస్తున్న ప్రభుత్వాలు


మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

టేకులపల్లి: సింగరేణిలో 27న గుర్తింపు సంఘ ఎన్నికలు జరుగబోతున్నాయని, ఈ ఎన్నికలలో విప్లవ కార్మిక సంఘాల తరపున పోటీ చేస్తున్న గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం చక్రంలో సుత్తి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సంఘం అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వరరావు, ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ పిలుపునిచ్చారు. కొత్తబావులు, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణ, రక్షణ చర్యల అమలు, సూటబుల్ ఉద్యోగం, సమస్యల పరిష్కారానికి పోరాడే వారికి అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కోయగూడెం ఓపెన్ కాస్టులో పిట్ మీటింగ్ జరిగింది. ఈ ప్రచారసభకు జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బయ్యా వరప్రసాద్ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల కష్టార్జితంతో సాధించిన లాభాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని సింగరేణి ఆస్పత్రిని ఆధునీకరించకుండా రూ.1,368 కోట్లు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికు కేటాయించి కంపెనీ ఆస్పత్రికి రూ.6.25 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్యాక్స్, డీఎంఎఫ్‌టీ పేరుతో రూ.వందల కోట్లు దండుకుంటున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పర్మనెంట్ కార్మికులతో సమానంగా పెరిగిందన్నారు. సింగరేణి ప్రైవేట్ పరం చేసేందుకు బొగ్గు బావుల అమ్మకానికి తెరదీసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అండగా నేడు జాతీయ కార్మిక సంఘాలు, టీబీజీకేఎస్ ఉందని విమర్శించారు. కార్యక్రమంలో జే.సీతారామయ్య, మహమ్మద్ రాసుద్దీన్, డి.ప్రసాద్, గవిని నాగేశ్వరరావు, కే.సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఐఎన్‌టీయూసీ లక్ష్యం


ఐఎన్‌టీయూసీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న త్యాగరాజు

ఇల్లెందు: సింగరేణిలో టీబీజీకేఎస్ వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, రానున్న కాలంలో కార్మికుల సంక్షేమానికి కట్టుబడిన ఐఎన్‌టీయూసీని గెలిపించాలని అనుబంధ సింగరేణి కోల్‌మైన్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి త్యాగరాజు అన్నారు. ఆదివారం ఇల్లెందులోని సీహెచ్‌పీ, ఏరియా స్టోర్ డిపార్ట్‌మెంట్లు కలిపి ఏర్పాటు చేసిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, కార్మికుల ఆకాంక్షలు నెరవేరాలంటే అధికార పక్షానికి అనుబంధంగా ఉన్న ఐఎన్టీయూసీని గెలిపిస్తే కార్మికుల మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లింగాల జగన్నాథం, డాక్టర్ శంకర్ నాయక్, మహబూబ్, కళ్లం కోటిరెడ్డి, బోలా, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, అన్వర్, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, దరియాసింగ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు త్యాగరాజు సమక్షంలో పలువురు ఐఎన్‌టీయూసీలో చేరారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగింది


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ఇల్లెందు: 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కార్మికులను కోరారు. ఆదివారం ఇల్లెందులోని జేకేఓసీలో జరిగిన పిట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో టీబీజీకేఎస్ సర్కార్ సంఘంగా గెలిచి కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. యాజమాన్యం వద్ద హక్కులను తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ఆర్థికంగా సింగరేణిని దివాలా తీయించిందన్నారు. ఇలాంటి సంఘం రానున్న రోజుల్లో కాలగర్భంలో కలిసి పోతుందన్నారు. జాతీయ కార్మిక సంఘాలను దూషించే టీబీజీకేఎస్ సాధించింది ఏమీ లేదని, నష్టాల్లో కూరుకుపోయిన సింగరేణి సంస్థను ఐదు జాతీయ కార్మిక సంఘాలు చర్చలకు పిలిచిన సందర్భంగా లాభాల దిశగా పెంపొందించాలని మారటోరియం ఇప్పించటం జరిగిందన్నారు. టీబీజీకేఎస్ హయాంలో ఒక్క కొత్త బావి కూడా ఏర్పాటు చేయలేకపోయిందన్నారు. 70 వేల నుంచి 37 వేల మందికి కార్మికులను కుదించి కారుణ్య నియామకాల పేరుతో కార్మికుల నుంచి రూ.లక్షలు దండుకున్న చరిత్ర ఉందన్నారు. సర్కార్ సంఘం విధానాల వల్ల సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. ఫలితంగా సింగరేణి భవిష్యత్ అంధకారంగా మారిందన్నారు. కార్మికులు కష్టపడి సంపాదించిన సొమ్మును సింగరేణి సంస్థకు సంబంధం లేని జిల్లాలకు ఖర్చు పెట్టి ఇప్పుడు కార్మికులకు జీతాలు ఇవ్వడానికి బ్యాంకుల నుంచి అప్పుల తేవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఐఎన్‌టీయూసీ కూడా అదే బాటలో నడిచిందన్నారు. ఈ విషయాలు గమనించి కార్మికులు మసలుకోవాలన్నారు. ఈ ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి నజీర్ అహ్మద్, దాసరి రాజారామ్, గడదాసు నాగేశ్వరరావు, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, గుగులోతు కృష్ణ, ఉడుత ఐలయ్య, సుందర్, సాలీట్ సాహెబ్, బొల్లెద్దుల శ్రీనివాస్, జక్కుల శ్రీనివాస్, బాలాజీ, దాట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.